క్లుప్తంగా

యువకుడికి సన్మానం



దామరగిద్ద: మండలంలోని ముస్తాపేట్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్‌గౌడ్ అగ్నివీర్‌కు ఎంపిక కావడంపై గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం, గ్రామ పెద్దల సమక్షంలో సోమవారం సత్కరించారు. దేశ సేవలో పాలు పంచుకోవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంజిలయ్యగౌడ్, మల్లప్ప, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని కందెనపల్లి గ్రామానికి చెందిన రఘునందన్ అగ్నివీర్‌కు ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువకుడికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నరేందర్, యశోవర్ధన్, భీం, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



దామరగిద్ద: మండలంలోని మొగుల్‌మడ్క గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సాయిలుగౌడ్, వెంకటప్ప, ఉషేనప్ప, అంజిలయ్యగౌడ్, మహిపాల్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

శవపేటిక వితరణ



దామరగిద్ద: మండలంలోని అన్నసాగర్ గ్రామ పంచాయతీకి గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం దివంగత కొత్తింటి వీరప్ప లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొత్తింటి సరోజ, మధుకర్ శవపేటికను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ విండో అధ్యక్షుడు హన్మిరెడ్డి, మోహన్‌రాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

ఊట్కూరు: ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ శాఖలో విధులు నిర్వహిస్తున్న వాకిటి కిష్టప్ప పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యజ్ఞేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



నర్వ: మండల కేంద్రం శివారులోని వ్యవసాయ పొలాల్లో పేకాట ఆడుతున్నారన్నా సమాచారం మేరకు ఎస్‌ఐ కురుమయ్య తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న జయప్రకాష్‌రెడ్డి, చంద్రయ్య, ఖాజన్‌గౌడ్, నర్సిములు, బోయ లక్ష్మయ్య, రాజారెడ్డిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నాలుగు బైకులు, సెల్‌ఫోన్లు, పేక ముక్కలతో పాటు రూ.1080 నగదు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

'సామాజిక సమానత్వమే ముఖ్యం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సామాజిక సమానత్వం, న్యాయం కోసం పోరాడతామని పట్టణ వీరశైవ సమాజం గౌరవాధ్యక్షుడు ముక్తా శ్రీశైలం అన్నారు. సోమవారం టీచర్స్‌కాలనీలోని రామాలయం వద్ద కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి అందరూ కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా గురుపాదయ్య, ప్రధాన కార్యదర్శిగా బసప్ప, కోశాధికారిగా శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా మధు స్వామి, జంగం శ్రీశైలం, నాగరాజు, కె.జగదీశ్వర్, సిద్దేశ్వర్, బసప్ప ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా వై.జగదీశ్వర్, శంకర్ తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



కొల్లంపల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ధన్వాడ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ధన్వాడలో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న అఖిలపక్ష పార్టీ నాయకులు, గ్రామస్తులు

ఘనంగా రంజాన్ వేడుకలు



దామరగిద్దలో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న నాయకులు



మాగనూర్‌లో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు, గ్రామ పెద్దలు



మద్దూరు ఈద్గా వద్ద సందేశాన్ని ఇస్తున్న ఇమామ్ అబ్దుల్ ఖాలీద్



కాన్‌కుర్తిలో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు



దామరగిద్దలో శుభాకాంక్షలు తెలుపుతున్న బస్వంత్‌రాజ్

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రంజాన్ సంబురాలు అంబరాన్నంటాయి. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి ఆదివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం రంజాన్ సందేశాన్ని వినిపించారు. కులమతాలకు అతీతంగా సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు ఇమామ్, మౌజమ్‌లు పేర్కొన్నారు. ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో చిన్నారులు రంగురంగుల వస్త్రాలతో ఆకర్షణగా నిలిచారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ముస్లింలకు మసీదులు, ఈద్గాల వద్ద పండుగ శుభాకాంక్షలు తెలిపి విందు ఏర్పాట్లు చేశారు.



గుండుమాల్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు



కృష్ణాలో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు



ఊట్కూర్‌లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



మద్దూరులో శుభాకాంక్షలు తెలుపుకొంటున్న చిన్నారులు



మరికల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మరికల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

మరికల్: మండలంలోని మాధవరంలో నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో గెలుపొందిన జట్టుకు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి మొదటి విజేతకు రూ. 5 వేలు, రెండో స్థానం పొందిన జట్టుకు రూ.3 వేలతో పాటు షీల్డ్ అందజేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి క్రీడాకారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా వరదరాజులస్వామి రథోత్సవం



రథంపై స్వామివారు



కోడూర్‌లో వరదరాజులస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

- ఘనంగా బిందెసేవ.. ఎద్దుల బండ్ల ఊరేగింపు
- భక్తి పారవశ్యంతో పులకించిన కోడూర్

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన కాంచీపురంలో వెలసిన వరదరాజులస్వామి సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం చోళుల రాజధాని అయిన ప్రస్తుత కోడూర్‌లో ప్రతిష్ఠితమయ్యారు. ఆనాటి నుంచి ఆనవాయితీగా ఉగాది పర్వదినం రోజు గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా వరదరాజులస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు వరదరాజులస్వామి దేవాలయంలో ఆదివారం ఉత్సవాలు ప్రారంభించారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

కోడూర్‌లో వెలసిన వరదరాజుల స్వామివారి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలతో ప్రధాన ద్వారం గుండా దేవస్థానం ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ రకాల పూలు, విద్యుత్ బల్బులు, మామిడి తోరణాలతో ముస్తాబు చేసిన రథంపై స్వామివారిని ఉంచి రథోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అడుగడుగునా దైవనామాన్ని స్మరిస్తూ భక్తులు స్వామివారి రథాన్ని సాంప్రదాయ రీతిలో గ్రామ శివారు వద్దకు తీసుకెళ్లి మళ్లీ వెనక్కి తీసుకొచ్చారు. కాగడాలు, విద్యుత్ బల్బుల వెలుతురులో మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం బిందెసేవ నిర్వహించారు. ఉగాది పర్వదినం మరుసటి రోజు హోలీ పండుగను గ్రామస్తులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆటలు ఆడుకున్నారు. ప్రతి ఏటా హోలీ రోజు కాకుండా వరదరాజులస్వామి ఉత్సవాలలో హోలీ పండుగ ప్రజలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం స్వామివారి దేవాలయం చుట్టూ ఎద్దుల బండ్ల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.శ్రీకాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామస్వామి, మన్యంకొండ పాలక మండలి డైరెక్టర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 14న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జరిగే బహుజన మహానీయుల శోభాయాత్ర కరపత్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన మహానీయుల శోభాయాత్ర పేరుతో మంచి కార్యక్రమానికి నిర్వాహకులు శ్రీకారం చుట్టారన్నారు. వారి ఆశయాలను ముందు తరాలకు అందించటానికి కృషి చేయాలని సూచించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, శోభాయాత్ర కమిటీ నాయకులు సింగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

నేటి నుంచి వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



వీరభద్రేశ్వరస్వామి విగ్రహం

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో వెలసిన భద్రకాళీ సమేతా వీరభద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, సభ్యులు తెలిపారు. మొదటి రోజు అంకురార్పణ, బుధవారం పల్లకీ సేవా, నందికోళ్ల సేవా అగ్నిగుండ ప్రవేశం, గురువారం డోలారోహణం, మహరథోత్సవం, శుక్రవారం రుద్రాభిషేకం, అఖండ హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతర ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కండక్టర్ కూతురు డిప్యూటీ కలెక్టర్



ఎస్.వీణ

నారాయణపేట రూరల్: ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి కూతురు గ్రూప్–1 పరీక్షల్లో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్‌కు ఎంపికైంది. పట్టణంలోని కుర్వగేరికి చెందిన సల్ల శ్రీనివాస్, వసంధరల కుమార్తె వీణ ఇటీవల విడుదలైన ఫలితాల్లో 484.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 118వ ర్యాంకు, మల్టీజోన్–2లో మూడో ర్యాంకు సాధించింది. మహిళా కేటగిరిలో రెండో స్థానంలో ఉండటంతో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యే అవకాశం ఉందని వీణ పేర్కొంది. ప్రస్తుతం వీణ గోల్కొండలోని బీజేఆర్ మహిళా కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తుంది. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పరీక్షలకు సంసిద్ధమైనట్లు వీణ పేర్కొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



ట్రస్ట్ అధ్యక్షుడు, సభ్యులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన బస్వరాజ్ బసవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దాదాపు 1500 మంది ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం అభినందనీయమని బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప అన్నారు. సోమవారం గుడెబల్లూర్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. యువకులకు ఆదర్శంగా నిలిచిన బస్వరాజ్‌కు తమ పార్టీ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జయానంద్‌రెడ్డి, రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్, సోమప్రకాష్, మాజీ సర్పంచులు అంజప్పగౌడ, తిమ్మప్ప, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

మాగనూర్: ఉగాది పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో చెందిన వాకిటి బ్రదర్స్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి పోటీలు ప్రారంభించారు. మరికల్‌కు చెందిన మధు మొదటి విజేత కాగా, రెండో విజేతగా నర్వ మండలం లంకల గ్రామానికి చెందిన కాంతారావు, మూడో విజేతగా వడ్వాట్ గ్రామానికి చెందిన మైబు గెలుపొందారు. విజేతలకు గ్రామ పెద్దలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ఏర్పాటు హర్షణీయం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మరికల్: నాలుగు దశాబ్దాల నుంచి బాటసారుల దాహం తీర్చేందుకు తీలేర్ స్టేజీ వద్ద ప్రతి వేసవిలో అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని తీలేర్ స్టేజీ వద్ద సోమవారం మాజీ సర్పంచ్‌లు వెంకారెడ్డి, వజ్రమ్మ, మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డిల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి వేసవిలో అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేవత్తమ్మ, ప్రదీప్‌గౌడ్, కృష్ణయ్య, అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కుర్మయ్య, ఆంజనేయులు, విజయ్‌కుమార్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మవ్వ జాతర వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

మాగనూర్: మండల పరిధిలోని బైరంపల్లిలో ఈనెల 8న నిర్వహించనున్న మారెమ్మవ్వ జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో మారెమ్మవ్వ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర మహోత్సవానికి కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ లాంటి ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, బైరంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.